# టెన్ కమాండ్‌మెంట్స్

పశువులన్నీ ఖులాసాగా కబుర్లు చెప్పుకుంటూ, ఆవేళ జరిగినవన్నీ నెమరువేసుకుంటూ ఇళ్ళకెళుతున్నాయి.

పక్షులన్నీ అప్పుడే గూళ్ళకెళ్ళడం ఇష్టంలేక ఆ ఇంటి మీద, ఈ గోడమీద కూర్చుని ఆవేళ విశేషాలు చెప్పుకుని నవ్వుకుంటున్నాయి.

"టైమెంతవుతుందో?" అనుకుంది పార్వతమ్మ.

"అయిదు" అంది సాయంత్రపు సైరను.

"అమ్మబాబోయ్! అప్పుడే అయిదై పోయింది. ఇంకా ఏ పనీ తెవల్లేదు. సరోజని చూడ్డానికి పెళ్ళివారొస్తారుకూడా" అని హడావిడిగా అటు, ఇటు తిరిగేసి అందరికీ పన్లు పురమాయించేసింది.

పెళ్ళివారు వచ్చేరు. వెళ్ళేరు.

"పిల్ల నచ్చలేదు. మరికొంచం రంగుంటే...."

మరో అయిదుగురు వచ్చేరు. వెళ్ళేరు.

వాళ్ళూ అదే అన్నారు.

నచ్చనిది, మరికొంచం వుండాల్సింది రంగుకాదు.

కట్నం.

ఆఖరికి ఎలాగైతేనేం ఆరోవాడు అమ్మాయికి మార్కులు ఎక్కువవేసి, కట్నం కొంత కన్సెషనిచ్చాడు. కుర్రాడి మంచితనాన్ని తెగ మెచ్చుకున్నారు. అమ్మాయి అదృష్టం అంతేలేదన్నారు. అమాంబాపతు అరవై వేలు ఖర్చయింది. పెళ్ళయిన పదిరోజులకే అతను అమెరికా వెళిపోయేడు పిల్లని తరవాత పంపమని. అధికమాసమనీ, ఆషాఢమాసమనీ, శ్రావణమాసం నోములనీ, మూఢం అనీ మొత్తానికో ఆర్నెల్లయినా పిల్లని పంపడం అవలేదు.

* * *

తెల్లవారు ఝాము.

"టైమెంత అవుతుంది చెప్మా!" అనుకుంది మూడో అంతస్తులో పడుకున్న మాలతి.

"నాలుగు" అంది వెనకింటి వెంకటేశంగారి కోడి. తను కుయ్యకపోతే పీళ్ళెవరూ లేవరో ఏమిటోనని.

దూరంగా టెలిఫోను తీగలమీద ఓ గుడ్లగూబ పక్కనున్న మొగుడ్ని పోయి పడుకుందాం రమ్మని గోలచేస్తుంది.

పరీక్షలు దగ్గరకొచ్చిన పక్షిపిల్లలు పాఠాలు చదువుకుంటున్నాయి.

అంతలో...

ఎక్కడినుంచో భయంకరమైన ఏడుపు.

మూడంతస్తులు పునాదుల్తో కదిలిపోయే ఏడుపు.

అంత హృదయ విదారకమైన ఏడుపు అంతవరకు వినని మాలతి తృళ్ళిపడి లేచింది. భయంతో ఒళ్ళంతా చెమటలు పట్టేసేయి. పక్కన పడుకున్న తల్లిని లేపింది భయంతోనే.

"పాపం! రేపు పదవరోజుకదే పక్కింట్లో. కిందకెళ్ళి తలుపేసుకొని పడుకో" అంది తల్లి పక్కకి వత్తిగిలుతూ.

"అంటే?" ఒక్క నిమిషం అర్థం కాకపోయినా రెండో నిమిషం అర్థం అయింది.

భగవాన్! ఎంత దారుణం!

పక్కింటి సరోజ మొగుడు అమెరికా వెళ్ళి ఆర్నెల్లైంది. పెళ్లై ఆర్నెల్ల పదిహేను రోజులయింది.

అక్కడతను తాగి తాగి గుడ్లు పేలి చచ్చిపోయేట్ట. వాడికర్మ. తాగి చాలామంది ఛస్తున్నారు. అందులో యితనొకడు. కాని...సరోజకి పాతికేళ్ళు కూడా లేవు.

ఇదిగో పసుపు, అదిగో ముసుగు.

రేపు పదవరోజు. అంటే....

ఆ అమ్మాయికి తెల్లచీరకట్టి, బలవంతంగా బొట్టు... ఇంక ఆలోచించలేకపోయింది.

"అమానుషం" అని గట్టిగా అరిచింది.

"ఏంచేటమ్మా యీ అన్యాయం. వాళ్ళంతా చదువుకున్నవాళ్ళు, మంచి మోడర్నుగానే వుంటారు. మరి..."

"పూర్వంనుంచి వస్తున్న ఆచారం...వద్దనుకుంటే పోతుందా?" అంది వాళ్ళమ్మ ఆవలిస్తూ.

"పళ్ళు రాలగొడితే పోతుంది" అనుకుంది మాలతి.

ఆ అమ్మాయి ఏడుపు ఇంకా వినిపిస్తూనే వుంది. ఏడు లోకాలు దాటి పారిపోయినా వెంబడించే ఏడుపు.

* * *

అవధానిగారికి ఆరుగురమ్మాయిలు. వాళ్ళింట్లో ఎప్పుడూ సంవత్సరం పొడుగునా ఏదో ఒకమ్మాయి పురుటికొస్తుంది. ఒక్కొక్క పురుటికి ఎంతలేదన్నా యీ రోజుల్లో వెయ్యి రూపాయలౌతాయి. ఒక్కొక్క అమ్మాయికి యిద్దరు లేక ముగ్గురు పిల్లలు పుట్టినా, ఆరురెళ్ళు పన్నెండో, ఆరుమూళ్ళు పద్దెనిమిదో పురుళ్ళు పొయ్యాలి. అంటే పద్ధెనిమిది వేలు. పైసలు కాదు, రూపాయలు!

"ఏంవిటీ అన్యాయం?" అని నాలాంటి పాపాత్ములు అడిగితే "ఆడపిల్ల పురుడు పుట్టింటివారు పొయ్యడం ఆచారం" అంటారు.

అవును మరి. మన ఆచారాలు ఒకటా? రెండా?

అందులో అతి ముఖ్యమైన టెన్ కమాండ్మెంట్స లాంటివి :

నం. 1. పెళ్ళిచూపులు ఆడపిల్ల ఇంట్లోనే.

నం. 2. పెళ్ళి ఆడపిల్ల ఇంట్లోనే.

నం. 3. కట్నం ఆడపిల్ల యివ్వాలి.

నెం. 4. ప్రతి పండుగకి అత్తవారు అల్లుడ్ని బహుమా నించాలి.

నెం. 5. కాపరానికి సరిపోయే సామానంతా పిల్లే తెచ్చుకోవాలి.

నెం. 6. కడుపుతోవుంటే సీమంతం పుట్టింటివాళ్లే చెయ్యాలి.

నెం. 7. పురుడు, నామకరణ వగైరా పుట్టింటి ఖర్చే.

నెం. 8. మూడో నెలని తల్లిని, పిల్లని దిగబెట్టాలి.

నెం. 9. ఖర్మకాలి మొగుడుపోతే పదవనాడు కట్టే తెల్లచీరకూడా కన్నవారి ఖర్మే.

నెం. 10. ఆఖర్న ఆడపిల్ల తండ్రి అడుక్కు తినాలి.

నా కిప్పటికీ అర్థంకాని విషయం యీ ఆచారాలన్నీ ఆడవాళ్ళ పరమైనవే. ఏ మొగాడ్నీ ఏ ఆచారం బాధించగా నేను చూడలేదు.

ఆచారాలు ఆకాశంలోంచి రాలలేదు. భూమిలోంచి మొలవనూలేదు. కేవలం స్వయంకృతాపరాధాలు.

అల్లప్పుడెప్పుడో....

మొగుడు హరీమంటే, వాడితోపాటు పెళ్ళాంకూడా 'కృష్ణా' అంటూ కాలిపోవల్సిందే. వాడికి కర్రల ఖర్చులేదు. పెళ్ళావే కర్రలుగా పనికొచ్చేదేమో! అంటే పెళ్లైన దగ్గ ర్నుంచి ఆడదానికి భయం పట్టుకుంటుంది వీడు ఎప్పుడు ఛస్తే

కేస్తాడో ఏంవిటోనని. ఎప్పుడూ మస్తీలోవున్న యమధర్మ రాజులా మొగుడు ఎదురుగా తిరుగుతూవుంటే యింక ఆ మొగుడితో సరదాగా సంసారం ఏం చేస్తుంది? ఈ ఆచారం బహుశా ఎవరో రాక్షసులు పెట్టేరేమో! కాని మనుషులు పెట్టతగిందికాదు. అప్పుడు మనం మరొకరి చేతికింద వున్నాం. వాళ్ళకి ఇలాంటి భయంకరమైన ఆచారాల్లేవు. అంచేత మా మతంలో చేరితే మీ కిలాంటి కష్టాలేం వుండవన్నారు వాళ్ళు. బతికుంటే ఏ మతమైంతే నేంవిటి అని చాలామంది వాళ్ళ మతంలో కలిసిపోవడం ప్రారంభించేరు. ఇలా సాగితే కొన్నాళ్ళకి హిందూమతం హిందూ మహాసముద్రంలో కలిసిపోతుందేమో నన్న భయం పట్టుకుంది మత పెద్దలకి. అంచేత కేవలం హిందూ మతోద్ధరణాకై సహగమనం తీసేస్తూ ఒక చట్టం చేయించారే తప్ప ఆడదానిమీద జాలితో మాత్రం కాదు.

"ఏ రామైతేనేం పళ్ళూడగొట్టుకోవడానికని" కారణ మేదైనా అప్పటినుంచి ఆడదానికి బతికే హక్కు వచ్చింది.

బతికే హక్కైతే వచ్చింది కాని అది కుక్కబతుకు. మొగుడుపోయిన ఆడది మళ్ళీ పెళ్ళి పేరెత్తకూడదు ఎంత చిన్నదైనాసరే. బొట్టు, జుట్టు, గాజు, పూస వగైరాలన్నీ తీసేసి, తెల్లచీరలే కడుతూ (తెల్లచీర సెక్స్ సింబలా లేక పతి వ్రతకు చిహ్నమా? మొదటిరాత్రి మొగుడిదగ్గర కెళ్ళినప్పుడూ తెల్లచీరే, వాడు పోయినా తెల్లచీరే? అదేంవిటో!) దైవ ధ్యానంతో గడపాలి. ఇంతకంటె వాడితే ఛస్తేనే నయమేమో?

అయితే పాపం పెళ్ళాంపోయిన మొగాడికి ఏఁవీఁ తియ్యా ల్సవసరంలేదు. మొగుడితో వచ్చిన మట్టె, మంగళసూత్రం తీసేసినా అర్థం ఉందేమోకాని, పుట్టుకతో వచ్చిన కట్టు,బొట్టు హక్కుల్ని తీసే అధికారం ఎవరికీ లేదు. అయితే అవన్నీ వుంటే అందంగా వుండి మొగాడ్ని ఆకర్షించి, తద్వారా చెడిపోతుం దని భయం. చెడేవాళ్ళకి ఇవేఁవీఁ అడ్డుకాదు. ఇక్కడ మనం మొగాడ్ని మెచ్చుకోక తప్పదు. అతను పాపం బొట్టుందా లేదా? పువ్వులున్నాయా? అని చూడడు. ఉంటే మంచిదే. లేకపోతే మరీ మంచిది. అందుకే కాబోలు "ఆల్ విమెన్ ఆర్ ఎ లైక్ ఇన్ డార్క్‌నెస్" అన్నాడో మహానుభావుడు.

అయితే ఈమధ్య మనం ఆడదాని జుత్తు జోలికి పోనంత ప్రోగ్రెస్ అయేం! ఆఖరికి ఆడది తన బొట్టు, కాటుక, పువ్వులు లాక్కోకుండా చట్టం చెయ్యాల్సిందేనేమో!

"తలలు బోడులైన తలపులు బోడులా" అని మొగుడితో పాటే వాంఛలు, కోరికలుపోవు. వాటికి చట్టంతోను, శాస్త్రం తోను సంబంధంలేదు. ఆ కోరికల ఫలితాలే అనాథ శరణా లయాలు. అవెంత బాగా నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది.

'విడో రీ మేరేజ్ ఏక్టు' వచ్చింది కదా యింకా ఏడు పెందుకూ? అంటారేమో! అవున్నిజవేఁ. కాని చేసుకునే మొగాడేడండీ, కాళ్ళమీద పడిన దానికి కడుపుచేసి పోయే వాడేగాని, ముప్పైమంది పెళ్ళాలు చచ్చినవాడికైనా సరే "కన్య" కావాలి. పెళ్ళాం పోయిన పదహారోనాడే మళ్ళీ

పీటలమీద కూర్చుంటాడు కన్యాదానానికి కాళ్ళు కడగమని. అదేవంటే ఆడదిక్కులేని ఇల్లు ఎలా అంటారు. మొగాడికి ఆడదిక్కు లేకపోయినా ఫరవాలేదు, వీధికో బోర్డింగు, సందుకో లాడ్జింగు ఉన్నంతకాలం.

మరి మొగదిక్కులేని ఆడదేవౌతుంది సార్? ఎంత చవటైనా సరే మొగుడనే ఉత్సవ విగ్రహం పక్కనుంటే ఆడదానికి మిగిలిన మొగాళ్ళనుండి రక్షణ అనే దౌర్భాగ్యం మనది.

ఈమధ్య చాలామంది పెద్ద మనుషులు అబార్షను లీగలైజు చేసి ఆడదాన్ని నెత్తికెక్కించుకున్నారని వాపోయేరు. "మరింక ఆడదానికి నీతీ, జాతీ వుంటాయా?" అంటూ భోరుమన్నారు కొందరు నీతిమంతులు.

ఇంట్లో టించర్ అయోడీన్ ఉంది కదా అని కత్తి పదును చూడ్డంకోసం చెయ్యి కోసుకుంటావా?

మనింట్లో డాక్టరున్నాడు, అతికేస్తాడని చెప్పి, కాళ్ళు విరిచేసుకుంటామా?

తిని కూర్చుని ఏ ఆడదీ తన కడుపు పంటని మంటపెట్టుకోవడానికి ఇష్టపడదు. ప్రపంచంలో ఏ బాధా కడుపుమంటతో సమానం కాదని మీ కర్థం అయ్యేటట్టు ఎలా చెప్పగలం? ఒకవేళ జరగకూడనిది (?) జరిగితే, ఆ పిల్లలెంతవరకు బాధ్యులు? వీధి కుక్కపిల్లకున్న పాటి ఆదరణకూడా నోచుకోని ఆ పిల్లలు చేసిన పాపం ఏవిటి?

మరం చేత చెయ్యాల్సింది అబార్షను లీగలైజు చెయ్యడంకంటే ముఖ్యమైనది, ప్రతి తల్లి తన కడుపున పుట్టిన పిల్లని ధైర్యంగా పెంచుకోగలిగే పరిస్థితుల్ని కల్పించడం, ఆ పిల్లని ఆదరించి, అభిమానించే మంచితనం.

ఒకరో, ఇద్దరో పిల్లలున్న ఆడదానికి మొగుడుపోతే, ఇంకావిడ బతుకు ఏం కావాలి? నువ్వు కావాలిగాని, నీ పిల్లలు ఒద్దనడం ధర్మమా?

మీ పెరట్లో అన్నీ మీరు వేసిన మొక్కలేనా? ఏ చిలకో, కాకో తెచ్చి పడేసిన గింజ మొలకై, మొక్కై, పువ్వులు పూసి, కాయలు కాస్తే అనుభవించటంలేదూ? ఛీ! ఈ విత్తనం నేను వెయ్యలేదని పీకి పారేస్తున్నారా?

ఎవరి పిల్లల్ని వాళ్ళు పెంచుకోవడానికి చట్టాలు కావాలా?

మనకిక్కావల్సింది చట్టాలు, అనాథ శరణాలయాలూ కాదు.

ప్రతి తండ్రికి వీడు నా కొడుకే అని చెప్పుకోగలిగే గుండె నిబ్బరం, ప్రతి తల్లికి మొగుడున్నా లేకపోయినా తన పిల్లల్ని బాహాటంగా పెంచుకోగలిగే మనో ధైర్యం.

నీతిని పవిత్రతని, మంచితనాన్ని, చట్టాల చట్రాల్లో బిగించకపోతేగాని వాటికి గతిలేదా? ★